క్లుప్తంగా

టీడీపీ ప్రచారంలో వలంటీర్



టీడీపీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాస్‌తో వలంటీర్ సాగర్

గాజువాక : ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఎన్నికల కమిషనే హెచ్చరికలు జారీ చేసినా కొంతమంది వలంటీర్లు పెడచెవిన పెడుతున్నారు. ఆదేశాలను పక్కనపెట్టి టీడీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. 76వ వార్డు గోపాలరెడ్డి నగర్‌లో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు నిర్వహించిన ప్రచారంలో పెదగంట్యాడ 01 (కోడ్ నంబర్ 21086368) సచివాలయానికి చెందిన సాగర్ అనే వలంటీర్ పాల్గొన్నారు. గత కొద్దిరోజులుగా టీడీపీ ప్రచారంలో సాగర్ యాక్టివ్‌గా పాల్గొంటున్నారని, తన విధులకు రాజీనామా చేయకుండా పాల్గొన్నంటున్న వలంటీర్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

75 మద్యం సీసాల పట్టివేత



మద్యం బాటిళ్లతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు సమీపంలో అనధికారికంగా కారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 75 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక స్టేషన్ హౌస్ ఆఫీసర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వై.లక్ష్మణ్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం..సీపీ రవిశంకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక స్టేషన్ హౌస్ ఆఫీసర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వై.లక్ష్మణ్‌నాయుడు, ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ సిబ్బందితో కలసి గురువారం ఉదయం 4.45 గంటలకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. గంగవరం పోర్టు సమీపంలో నెల్లిముక్కుకు చెందిన వెంపాడ చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి కారులో డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 65 మద్యం సీసాలు, 10 బీరు సీసాలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల 61 వేల 895 ఉంటుందని తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉచిత హెల్త్ చెకప్ ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ-1)లో గురువారం ఉచిత హెల్త్ చెకప్ ప్రారంభించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగరంలోని మాధవ్‌బాగ్ మల్టీ డిసిప్లినరీ కార్డియాక్ కేర్ క్లినిక్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి జీఎం డాక్టర్ సారంగి ప్రారంభించారు. కళాక్షేత్రం కార్యదర్శి డొక్కా నర్సింగరావు మాట్లాడుతూ ఈ నెల 30 వరకు ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న ఈ చెకప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుర్తింపు యూనియన్ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, మాధవ్‌బాగ్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

1155వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, ఆంధ్ర రాష్ట్ర ప్రత్యేక హోదా సాధనకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలను భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1155వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌పాంట్‌లోని ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్ ఆర్ఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

అడుగడుగునా నీరా'జనం'

- జోరుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ ప్రచారం
- హారతులు, పుష్పాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు
- 76, 72 వార్డుల్లో హోరెత్తిన నినాదాలు



ప్రచారంలో ప్రసంగిస్తున్న అమర్‌నాథ్

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతించగా.. అభిమానులు పుష్పాల జల్లు కురిపిస్తున్నారు. జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్‌బోర్డు కాలనీలో గురువారం అమర్‌నాథ్ పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 76వ వార్డు నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో ఆయన వార్డులో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లారు. ఈ ఎన్నికల్లో గాజువాక అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మికి మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గాజువాకను మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ, చిక్కా సత్యనారాయణ, రంబ నారాయణమూర్తి, కులుకూరి మంగరాజు, తాటికొండ జగదీష్, అనపర్తి రమణ, మురళీ, చిన్నారావు, బ్రహ్మానందరెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, మంత్రి మంజుల, పార్వతి, పి.ప్రమీల, రామలక్ష్మి, కె.పెంటారావు, పుష్ప, స్వాతి, రామజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందిస్తున్న అమర్‌నాథ్



అమర్‌నాథ్‌కు హారతి ఇస్తున్న మహిళలు



72వ వార్డు ప్రచారంలో పాల్గొన్న అమర్‌నాథ్, చింతలపూడి తదితరులు



72వ వార్డు ప్రచారంలో పాల్గొన్న మహిళలు

మహిళల ఓట్లు వైఎస్సార్‌సీపీకే..

గాజువాక : ఈ ఎన్నికల్లో మహిళలంతా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఏకపక్షంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెహర్‌నగర్, చైతన్యనగర్, చినగంట్యాడ ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చిరు వ్యాపారులను పలకరించి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తారన్నారు. దూరదృష్టి కలిగిన జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు రాజాన వెంకటరావు, రెడ్డి జగన్నాథం, విజయ, నర్సింగరావు, సిరసపల్లి శ్రీనివాస్, ధనలక్ష్మి, భవాని, నాగమణి, వరలక్ష్మి, జానకమ్మ, నాయుడు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు కృషి



క్రీడాకారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- రూ.4 వందల కోట్లతో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రణాళిక
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: విశాఖలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటానని రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్‌తో పాటు అథ్లెటిక్స్, కరాటే, తైక్వాండో క్రీడాకారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో మట్టిలో మాణిక్యాలను వెలికి తీశారన్నారు. క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్న కోచ్‌ల తపనను తాను అర్థం చేసుకోగలనన్నారు. ఏపీలో స్పోర్ట్స్ విలేజ్ దేశానికే దిక్సూచిగా ఉండే విధంగా ఏర్పాటు చేస్తానని చెప్పారు. రూ.4 వందల కోట్లతో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. గాజువాకలో క్రీడాకారులకు అన్ని రకాల వసతులతో కూడిన క్రీడా మైదానాన్ని కేటాయిస్తామన్నారు. ఇటీవలే గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహకారంతో పెదగంట్యాడలో రూ.6 కోట్లతో స్టేడియం నిర్మించామన్నారు. 2024లో జరగనున్న ఆడుదాం ఆంధ్రాలో బాక్సింగ్‌ను చేర్చేటట్లు ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అని జి.వి.రవిరాజు అన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను గెలిపించాలని క్రీడాకారులను, క్రీడా సంఘాల ప్రతినిధులను కోరారు.

కోచ్‌ల వినతి

విశాఖలో క్రీడలు, వ్యాయామాలకు తగిన ప్రోత్సాహం కల్పించాలని కోరుతూ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రవిరాజు నేతృత్వంలో కోచ్‌లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతి పత్రం అందించారు. రవిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు దల్లి రామకృష్ణా రెడ్డి, మెంబర్లు ఎస్.నూకరాజు, ఐ.సాయి ప్రసాద్, మారుతీ బాక్సింగ్ క్లబ్ కోచ్ మారుతీ ప్రసాద్, భాస్కరరావు, విఠల్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గుడివాడ లతీష్, కురిటి మాధవ నాగేశ్వరరావు, వరదాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమర్ గెలుపుతో మరింత అభివృద్ధి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్ భార్య హిమగౌరి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించి గాజువాకను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని అమర్‌నాథ్ భార్య హిమగౌరి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె 74వ వార్డు మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలన్నింటినీ మహిళల పేరుమీదనే అందిస్తూ, మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ఎన్.వై.నాయుడు, గొందేశి సత్తిరెడ్డి, డాక్టర్ ఎస్.రాజారావు, అనపర్తి త్రినాథ్, కె.కృష్ణ, వియ్యపు కిషోర్, కోట నాయుడు, గొరుసు రామలక్ష్మి,ఈశ్వరి, విజయ లక్ష్మి, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర



పూజలందుకున్న దుర్గాలమ్మ వారు



పారాయణం చేస్తున్న మహిళలు

అగనంపూడి: అగనంపూడి గ్రామ ఇలవేల్పు దుర్గాలమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. అగనంపూడి పంచాయతీ రహదారిలోని ఇరుకు ఆవరణలో అమ్మవారి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి పాత అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పారాయణం చేశారు. బొబ్రమాంబ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి భారీ ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భాస్కరరావు సత్తా



భాస్కరరావుకు బంగారు పతకాలను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడ మండలం భానోజీతోటకు చెందిన ఉక్కు ఉద్యోగి మర్ల భాస్కరరావు సత్తా చాటారు. షాట్‌పుట్, పవర్‌లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలు సాధించారు. సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 5 వరకూ నేపాల్‌లోని పొఖారాలో గల రంగశాల స్టేడియంలో 9వ అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన మర్ల భాస్కరరావు షాట్‌పుట్‌లో 10.84మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే పవర్ లిఫ్టింగ్ 74కిలోల విభాగంలో 380కిలోల బరువు ఎత్తి బంగారు పతకాన్ని సాధించారు. భాస్కరరావును ఏజీకే చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ఉక్కు యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

శాంతి, సామరస్యాలకు ప్రతీక

- దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక రంజాన్
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



ఈద్గా మైదానంలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న గుడివాడ అమర్‌నాథ్



రంజాన్ సందర్భంగా పెదమడకలోని మసీద్‌లో మాట్లాడుతున్న అధ్యక్షుడు బాషా

గాజువాక : శాంతి సామరస్యాలకు గాజువాక ప్రాంతం ప్రతీక అని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన, శాంతితో ఉండటం పవిత్ర రంజాన్ విశిష్టత అన్నారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనల సందర్భంగా వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలరోజులు కఠిన దీక్షలను పూర్తి చేసుకొని రంజాన్ పండుగ చేసుకోవడం, శాంతి మార్గంలో నడవడం, పేదవారికి సాయం చేయడం తదితర అంశాలు అల్లా మనకు చూపిన మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు మహ్మద్ రఫీ, షౌకత్ అలీ, షఫీ, ఇర్ఫాన్, లుక్మాన్, చోటూ, సర్దార్, మోదీ, ఖాజా, షాహిద్, చాంద్ బాషా, ఫజిల్, మదీనావలి తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలు అజీమాబాద్ నుంచి కణితి రోడ్ మీదుగా బీసీ రోడ్‌లోని ఈద్గా మైదానానికి శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు చేసిన ముస్లింలు పవిత్ర రంజాన్ సందర్భంగా ఉదయం నుంచీ ఈద్గాతో పాటు మసీదుల్లోను ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు

పెదగంట్యాడ: రంజాన్ పర్వదినాన్ని మండలంలోని ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పవిత్ర రంజాన్ మాసం మొత్తం నిష్ఠగా ఉపవాసాలు ఉన్న వీరంతా బుధవారం సాయంత్రం చంద్రుడిని చూసి గురువారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని మదీనాబాగ్, ఇస్లాంపేట, చినపాలెం, పెదపాలెం, నడుపూరు, దేవాడ తదితర ప్రాంతాల్లో ముస్లింలంతా ఈద్గా వద్దకు చేరుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ 77వ వార్డు మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎస్కే నన్నా, అజారుద్దీన్, అబ్దుల్ జబర్, అమీద్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌నగర్‌లోని మసీద్-ఉల్-మోమీనీన్ వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మత సామరస్యానికి ప్రతీక

అగనంపూడి: హిందూ, ముస్లింలు ఐకమత్యంగా చేసుకునే రంజాన్ పండగ మత సామరస్యానికి చిహ్నమని అగనంపూడి పెదమడక మస్జిద్ అబూబకర్ అధ్యక్షుడు బాషా అన్నారు. పెదమడకలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, వల్లీ, షేక్ సిలారి, హుస్సేన్, సలీమ్, మీరా మహమ్మద్, కర్రి దోసేంద్ర, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, డి.రమేష్, ఇ.నరసింగరావు, పోలినాయుడు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో..

ఉక్కునగరం: ముస్లింల ముఖ్య పండుగ రంజాన్‌ను ఉక్కునగరంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉక్కునగరం మసీదులో ఉదయం నిర్వహించిన ప్రత్యేక నమాజ్‌లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించి ఖురాన్‌ను పఠించారు. బంధుమిత్రులను ఇళ్లకు ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. స్నేహితుల ఇళ్లకు వెళ్లి బహుమతులు అందజేశారు. మసీదు కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



రంజాన్ ప్రార్థనలకు తరలివెళ్తున్న ముస్లింలు



ప్రార్థనకు వెళ్తున్న బాలలు, పెద్దలు

ప్రజాసేవలోనే 'గుడివాడ' కుటుంబం

- అమర్‌ను ఆదరించి, ఆశీర్వదించండి
- అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి



తుంగ్లాంలో ప్రచారం నిర్వహిస్తున్న గుడివాడ నాగమణి

అక్కిరెడ్డిపాలెం: 'గుడివాడ' కుటుంబం తరతరాలుగా ప్రజాసేవలోనే ఉందని గాజువాక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి అన్నారు. తన మామగారు గుడివాడ అప్పన్న, భర్త గుడివాడ గురునాథరావు గాజువాక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. వారిబాటలోనే నడుస్తున్న తన కుమారుడు అమర్‌నాథ్‌ను ఆశీర్వదించాలని కోరారు. 69వ వార్డు తుంగ్లాంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోగాది సన్యాసిరావు, ఈశ్వరరావు, కొల్లి వినోద్ రెడ్డి, దుర్గారెడ్డి, కాకి అప్పలరెడ్డి, అంగ బాబూరావు, ఈటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త.. పూలే

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంఘ సంస్కర్తగా, సామాజిక తత్వవేత్తగా ఆయన చేసిన సేవలు నిరుపమానమన్నారు. పూలే జయంతి సందర్భంగా బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సంపంగి ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, పిట్టా రెడ్డి, కాకినాడ పెంటారావు, పల్లా పెంటారావు, గొందేశి రాము తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

అక్కిరెడ్డిపాలెం: అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావు పూలే అని భెల్ లైజన్ ఆఫీసర్ వర్మ అన్నారు. సంస్థ ఓబీసీ కార్యాలయంలో ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడు పూలే అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సంఘ అధ్యక్షుడు సీహెచ్.సీతంనాయుడు, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు బొండ బాబూరావు, ఆనందరావు, కొల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు

వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో బీసీల ఆరాధ్యదైవం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోని ప్రజలకు అక్షర జ్ఞానం అందరికీ కావాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అన్నారు. భార్య సావిత్రి భాయ్‌కు చదువు చెప్పించి తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, ఎన్నేటి రమణ, నమ్మి ప్రసాద్, పరదేశి, పిట్టా రెడ్డి, నల్లమల్లి శ్రీనివాస రెడ్డి, బి.శశిభూషణ్, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి: పూలే జయంతి సందర్భంగా అగనంపూడిలో ఆయన చిత్రపటానికి దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తోకాడ రాము, కరణం పైడిరాజు, పైడిరాజు, గంధోళి పైడికొండ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీహెచ్‌పీవీ ఓబీసీ లైజన్ ఆఫీసర్ వర్మ

పోరాట కమిటీ నాయకుల నివాళి

కూర్మన్నపాలెం: పూలే జయంతిని కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీక్షలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్ఎండీ విభాగ కార్మికులు, ఉక్కు పోరాట కమిటీ నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని దళిత సంఘాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు అన్నారు. పూలే జయంతి సందర్భంగా వుడా నగర్ ఫేజ్-1లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూలే సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాలి ఆనంద్, జొన్నకూటి విజయ్‌కుమార్, పట్నాల రాజు, శ్యామ్, జి.నిర్మల, ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పోరాట కమిటీ నాయకులు